సాక్షి విశాఖపట్నం

బుధవారం । 20 । మార్చి । 2024




చందనోత్సవం ఏర్పాట్ల పరిశీలన

సింహాచలంలో మే 10న జరగనున్న చందనోత్సవంలో పోలీస్ బందోబస్తుపై సీపీ రవిశంకర్ పరిశీలన చేశారు. 8లో



ఆ ప్రకటనలకు అనుమతి లేదు

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లకు అనుమతిలేదు. 8లో



పక్కా ప్రణాళిక.. పటిష్ట పర్యవేక్షణ

- **జిల్లా పరిధిలో 8 మానటరింగ్ కేంద్రాల ఏర్పాటు**
- **ఒక్కో కేంద్రం నుంచి ఒక్కో అంశం పర్యవేక్షణ**
- ప్రచారాల అనుమతులకు సింగిల్ విండో సిస్టమ్
- 24/7 అందుబాటులో ఫోన్ ఫిర్యాదుల సెల్
- నేరుగా ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- అభ్యర్థుల ఖర్చులు ఆరా తీసేందుకు ప్రత్యేక మానటరింగ్ కేంద్రం

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పార్టీల ప్రచారం నుంచి అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసా లెక్క పక్కాగా పర్యవేక్షించేలా మానటరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున స్వీయ పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. టీవీలు, పత్రికలే కాకుండా సామాజిక మాధ్యమాలపైనా నిఘా ఉంచారు. పార్టీ అయినా.. అభ్యర్థి అయినా.. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లు గుర్తిస్తే.. సామాన్యుడు సైతం ఫిర్యాదు చేసేందుకు ఫిర్యాదుల సెల్ అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తంగా 8 మానటరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి.. ప్రత్యేకాధికారులు, సిబ్బందిని నియమించారు. కలెక్టరేట్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రత్యేక కేంద్రాల గురించి తెలుసుకుందాం.

హెల్ప్ డెస్క్



ఎక్కడ : పీఏజీబీ సెక్షన్, కలెక్టర్ కార్యాలయంలో..
ఎవరు పర్యవేక్షిస్తారు : డీఆర్‌డీఏ డీపీఎం పి.అరుణకుమారి, ఏపీఐఐసీ డిప్యూటీ తహశీల్దార్ టీవీఎల్ రాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కె.మనోజ్‌కుమార్
టైమింగ్స్ : ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నలుగురు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకూ నలుగురు సిబ్బంది అందుబాటులో ఉంటారు.
ఏం చేస్తారు.? : ఎన్నికలకు సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా.? నామినేషన్లు, ప్రచారానికి సంబంధించిన సందేహాలు నివృత్తి చేస్తారు.

సింగిల్ విండో సిస్టమ్



ఎక్కడ : కలెక్టరేట్‌లోని ల్యాండ్ రిఫార్మ్స్ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కార్యాలయంలో..
ఎవరు పర్యవేక్షిస్తారు : ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.సత్యపద్మ
నోడల్ అధికారులెవరు : పోలీస్ విభాగం నుంచి డీసీపీ-1 సీహెచ్‌వీఎస్ మణికంఠ, ఆర్‌అండ్‌బీ నుంచి డీఈఈ గోవిందరావు, ఎయిర్‌పోర్ట్ నుంచి ఆపరేషన్స్ జేజీఎం బి.రాజారమణ్, ఏడీఎఫ్‌వో కేవీటీ ప్రసాద్, రవాణా శాఖ నుంచి ఎంవీఐ హరిప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ నుంచి ఈఈ పి.వెంకటేశ్వరరావు, జీవీఎంసీ నుంచి డీపీఎం చంద్రికతో పాటు నలుగురు సపోర్టింగ్ స్టాఫ్.
ఏం చేస్తారు.? : ఒక అభ్యర్థి ర్యాలీలు, మైక్‌లు, ప్రచారానికి వాహనాలు, డ్రోన్ల వినియోగం.. ఇలా ఏ అనుమతి కావాలన్నా.. ఇక్కడే ఒకే చోట దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం 24 గంటల్లో ఫైల్ క్లియర్ చేస్తారు. ఆన్‌లైన్‌లోగానీ, మాన్యువల్‌గా గాని దరఖాస్తు చేసుకోవచ్చు.

సీ-విజిల్ కంట్రోల్ రూమ్



ఎక్కడ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్(సీవోసీ)లో
ఎవరు పర్యవేక్షిస్తారు: జీవీఎంసీ టీపీ సెక్షన్ సూపరింటెండెంట్ తిరుమలరావు, జీవీఎంసీ సీనియర్ అసిస్టెంట్ ఆర్.శ్రీనివాస్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.నరేష్
టైమింగ్స్ : 24 గంటల పాటు ప్రతి 8 గంటలకు ఏడుగురు చొప్పున అందుబాటులో ఉంటారు.
ఏం చేస్తారు : ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) రూపొందించిన సీ-విజిల్(సిటిజన్ విజిలెన్స్) యాప్ ద్వారా పౌరులు ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పార్టీల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదులను ఈ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోల రూపంలో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేస్తారు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో ఈ సీ-విజిల్ కంట్రోల్ రూమ్ సిబ్బంది విచారణ చేపట్టి నివేదికని ఎన్నికల అధికారులకు అందిస్తారు.

24/7 కాల్ సెంటర్



ఎక్కడ : కలెక్టరేట్‌లోని 104 కాల్ సెంటర్‌లో
ఎవరు పర్యవేక్షిస్తారు : అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బి.మునిస్వామి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జె.జ్యోతిశ్రీ, డీఆర్‌డీఏ ఏపీఎం డి.వల్లయ్య
టైమింగ్స్ : 24 గంటల పాటు ప్రతి 8 గంటలకు **ఐదుగురు చొప్పున** అందుబాటులో ఉంటారు.
ఏం చేస్తారు : అభ్యర్థులు, పార్టీలు నిబంధనలు **ఉల్లంఘించినట్లు** గుర్తిస్తే 0891-2590100 నంబ**ర్‌కు ఎవరైనా ఫిర్యా**దు చేయవచ్చు. ఫిర్యాదులకు **ఫోన్ చేసినప్పుడు** లైన్స్ బిజీ కాకుండా ఐదు హంటింగ్ లైన్స్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదులను పరిశీలించి సమగ్ర నివేదికను సీఈవో, ఈసీఐకి పంపిస్తారు.

ఫిర్యాదుల మానటరింగ్ కంట్రోల్ రూమ్



ఎక్కడ : విశాఖపట్నం ఆర్డీవో కంప్యూటర్ రూమ్‌లో
ఎవరు పర్యవేక్షిస్తారు : దివ్యాంగుల సంక్షేమ ఏడీ జె.మాధవి
టైమింగ్స్ : 24 గంటల పాటు ప్రతి 8 గంటలకు ఎనిమిది మంది చొప్పున అందుబాటులో ఉంటారు.
ఏం చేస్తారు.? : అభ్యర్థులు, పార్టీలు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే.. నేరుగా ఈ కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. 24/7 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా వీరే పర్యవేక్షించి, వాటిని పరిష్కరించి సమగ్ర నివేదికను సీఈవో, ఈసీఐకి పంపిస్తారు.

ఎక్స్‌పెండేచర్ మానటరింగ్ కంట్రోల్ రూమ్



ఎక్కడ : కలెక్టరేట్ మెయిన్ ఎంట్రన్స్ ఎదురుగా
ఎవరు పర్యవేక్షిస్తారు : జిల్లా ఆడిట్ అధికారి
నోడల్ ఆఫీసర్ ఎవరు : యూఎల్‌సీ సూపరింటెండెంట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుంటారు. ఇందులో యూఎల్‌సీ సెక్షన్ స్టాఫ్ మెంబర్స్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది ఉంటారు.
ఏం చేస్తారు : పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. తాము చేసిన ఖర్చుల నివేదికలను ఈ కార్యాలయానికి అందజేయాలి.

మీడియా, సోషల్ మీడియా మానటరింగ్ కంట్రోల్ రూమ్



ఎక్కడ : కలెక్టరేట్‌లోని సర్వే ఇన్‌స్పెక్టర్ రూమ్‌లో..
ఎవరు పర్యవేక్షిస్తారు : డీఐపీఆర్‌వో ఎస్వీ రమణ పర్యవేక్షణలో ఐదుగురు సిబ్బంది ఉంటారు.
ఏం చేస్తారు : పత్రికలు, టీవీల్లో వచ్చే ఎన్నికల వార్తలతో పాటు వ్యతిరేక వార్తలను ట్రాక్ చేసి నివేదికలు తయారు చేస్తారు. ఏవైనా తప్పుడు వార్తలు ప్రచురిస్తే.. వాటికి సంబంధించిన వాస్తవాలతో కూడిన ప్రెస్‌నోట్స్ విడుదల చేస్తారు. రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘానికి పంపిస్తారు.

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ



ఎక్కడ : విశాఖ ఆర్డీవో చాంబర్ పక్కనే ఉన్న ఎల్ఆర్‌డీటీ రూమ్‌లో..
ఎవరు పర్యవేక్షిస్తారు : డీపీఆర్‌వో, ఏయూ జర్నలిజం విభాగం ప్రొఫెసర్‌తో పాటు ఐదుగురు ఉంటారు.
ఏం చేస్తారు : పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాల్లో వచ్చిన వార్తలు పెయిడ్ ఆర్టికల్సా? కావా? అనేది పరిశీలిస్తారు. పెయిడ్ ఆర్టికల్స్‌గా పరిగణిస్తే.. వాటిని అభ్యర్థుల ఖర్చుల్లో జమచేస్తారు.

వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్

ఎక్కడ : కలెక్టరేట్‌లోని 104 కాల్ సెంటర్‌లో
ఎవరు పర్యవేక్షిస్తారు : డీఈవో కార్యాలయం ఐటీ సపోర్ట్ డి.చంద్రశేఖర్, జీవీఎంసీ జోన్-6 అధికారి పవన్‌కుమార్
టైమింగ్స్ : 24 గంటల పాటు ప్రతి 8 గంటలకు ఇద్దరు చొప్పున అందుబాటులో ఉంటారు.
ఏం చేస్తారు : వెబ్ క్యాస్టింగ్‌ని పరిశీలిస్తారు.

నాడు కత్తెర.. నేడు జాతరలా..

ఆనందమానందమాయె

అవ్వాతాతల మోములో చిరునవ్వులు



- చంద్రబాబు హయాంలో పింఛనుదారుల బాధలు వర్ణనాతీతం
- రాబందుల్లా పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు
- కుంటిసాకులు చెబుతూ వృద్ధుల పింఛన్లకు కత్తెర
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన చిత్రం
- ప్రస్తుతం రూ.3 వేలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళిపై నేడు అవగాహన సదస్సు

మహారాణిపేట: లోక్‌సభ, శాసనసభ ఎన్నికల ప్రక్రియ, ప్రవర్తనా నియమావళి, నామినేషన్లు, ఇతర అన్ని అంశాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జున తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు. ఇది కేవలం ఎన్నికల విధి విధానాలపై అవగాహన కల్పించే సదస్సుగా మాత్రమే పరిగణించగలరని స్పష్టం చేశారు.

విశాఖ చేరుకున్న డీసీ ఆటగాళ్లు



డీసీ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ

గోపాలపట్నం: ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టుకు చెందిన పలువురు ఆటగాళ్లు మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో డీసీ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ, కెప్టెన్ డేవిడ్ వార్నర్‌తో పాటు మరో ఇద్దరు ఆటగాళ్లు వచ్చారు. వీరు రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

మాజీ సైనికుల గుర్తింపు కార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఎంవీపీకాలనీ: మాజీ సైనికుల గుర్తింపు కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ గుర్తింపు కార్డుల మంజూరు కోసం డైరెక్టర్, సైనిక సంక్షేమశాఖ విజయవాడ ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. www.apsainik.com/auth/login లో రిజిస్టర్ చేసుకోవాలని, సంబంధిత అర్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఆ దరఖాస్తుకు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, బ్యాంకు బుక్, ఆధార్‌కార్డు ప్రతులను జత చేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అనంతరం కార్డు జారీ చేస్తామన్నారు.

ఇది కోడ్ ఉల్లంఘన కాదా!

వైద్య శిబిరాలతో కలరింగ్

డాబాగార్డెన్స్: ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా టీడీపీ, జనసేన నాయకులు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలోని 39వ వార్డు లక్ష్మీటాకీస్ ప్రాంతంలో సోమవారం బసవతారకం ఆస్పత్రి, గీతం ఆస్పత్రి సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. వైద్య శిబిరం పేరుతో తమ పార్టీల ప్రచారం చేసుకోవడానికి ప్రజలను వైద్యశిబిరానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి టీడీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి, గతంలో ఎంపీగా టీడీపీ తరఫున పోటీ చేసిన భరత్, జనసేన నాయకుడు, దక్షిణ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. భరత్ అధ్యక్షుడిగా ఉన్న గీతం ఆస్పత్రి, అతని మామ బాలకృష్ణ నిర్వహిస్తున్న బసవతారకం ఆస్పత్రి సంయుక్తంగా వైద్య శిబిరం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఈ కార్యక్రమం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. భరత్, వంశీకృష్ణ అక్కడే ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు ఏమిటని ప్రశ్నించడం, తాము అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామంటూ వారికి భరోసా ఇస్తూ.. మందులు ఇస్తున్నట్లు ఫొటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇది ముమ్మాటికీ ఓటర్లను ఆకట్టుకునే ప్రక్రియలో భాగంగా నిర్వహించిన కార్యక్రమం అని మిగతా పార్టీల నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.



రోగులకు మందులు అందిస్తున్న భరత్, వంశీకృష్ణ

ప్రజలతో మమేకమవుతూ.. కన్నీళ్లు తుడుస్తూ..

ఏయూక్యాంపస్: ప్రజలతో మమేకమై ప్రయాణం చేస్తున్నారు..ప్రజల కష్టాలు తెలుసుకుని కన్నీళ్లు తుడుస్తున్నారు. వారి ఇంట్లో సభ్యుడిగా మారిపోతున్నారు. నడిరోడ్డుపై కలిసి భోజనం చేస్తున్నారు.. వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ. 19వ వార్డు జాలరిపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పొట్టి పైడమ్మ కుటుంబ సభ్యులను మంగళవారం ఎంవీవీ ఓదార్చారు. వారి కుటుంబాన్ని పరామర్శించి నేనున్నానంటూ ధైర్యాన్ని నింపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి రోడ్డుపై కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి దాసు, వాడమోదుల గణేష్, బెహరా వసంత, గ్రామ పెద్ద పరసన్న, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



రోడ్డుపై కూర్చుని భోజనం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

అనకాపల్లి ఎంపీ సీటు ప్రకటనకు సమయముంది

ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

గోపాలపట్నం: ఇప్పటివరకు జరిగిన సిద్ధం సభలు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి మంగళవారం విశాఖ వచ్చిన ఆయనకు పార్టీ నేతలు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఎవరి పక్కన ఉన్నారో త్వరలో తెలుస్తుందని, నాయకుడంటే ఇలా ఉండాలి అని నమ్మిన వారు మా పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. వారిని సగౌరవంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి ఎంపీ సీటు ప్రకటించేందుకు సమయముందన్నారు. ఈ నెల 27 నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి బస్సుయాత్ర మొదలుపెడతారని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తదితరులు ఎయిర్‌పోర్టులో ఆయనను స్వాగతం పలికారు.



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

వైజాగ్.. అద్భుతం

భారత్‌లో యూఎస్ రాయబారి ఎరిక్ ప్రశంస



సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి దృశ్యాల అద్భుతం.. వైజాగ్ అని యూఎస్ రాయబారి ఎరిక్ గార్సెట్టీ కొనియాడారు. టైగర్ ట్రయంఫ్ యుద్ధ విన్యాసాలను ప్రారంభించేందుకు విశాఖ వచ్చిన ఆయన నగరంలోని పలు పర్యాటక స్థలాలను సందర్శించారు. కైలాసగిరిపై విహరించిన ఎరిక్ దంపతులు.. అక్కడి నుంచి విశాఖ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. 'కైలాసగిరి పార్క్ నుంచి కనిపిస్తున్న వైజాగ్ అందాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి. భారత్‌లోని ప్రకృతి దృశ్యాల అద్భుతమైన వైవిధ్యం నన్నెప్పుడూ ఆశ్చర్యపరుస్తూనే ఉంది. ఈ అద్భుత ప్రాంతాన్ని సంరక్షిస్తూ.. మరింత అందంగా.. ఆహ్లాదంగా తీర్చిదిద్దిన జీవీఎంసీకి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.' అంటూ ఎరిక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

నాలాంటోళ్లకు అండ జగన్



నా పేరు ఉమ్మిడి అమ్మోరమ్మ. నేను మత్స్యకార కుటుంబానికి చెందిన మహిళను. మంగమారిపేటలో నివాసం ఉంటున్నాను. నా భర్త ఉమ్మిడి ఎల్లయ్య తొమ్మిదేళ్ల కిందట చనిపోయారు. నాకు ఎల్మాజీ, ఆదిలక్ష్మి, అరుణ ముగ్గురు ఆడ పిల్లలు. ఆయన చనిపోయిన తర్వాత కుటుంబ నిర్వహణ భారం పడింది. కూలి పనులు చేసుకుని.. ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం నేను నా తమ్ముడు ఇంట్లో ఉంటున్నాను. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ.3వేలు నా నెల ఖర్చుకు సరిపోతోంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ నా శేష జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛన్ కోసం మాకు దూరంగా ఉన్న కె. నగరపాలెం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. జగన్‌బాబు వచ్చిన తర్వాత వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. కొడుకులా ఆదుకుంటూ ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తుండటంతో.. మూడు పూటలా కడుపు నిండా తింటున్నా. నాలాంటి వాళ్లకు అండగా ఉంటున్న జగన్ చల్లగా ఉండాలి.

జగన్ మేలు గొప్పది



నా పేరు దళాయి ఈశ్వరమ్మ. జీవీఎంసీ 35వ వార్డు చినదుర్గాలమ్మ వీధిలో ఉంటున్నా. నేను 70 రూపాయల నుంచి పింఛన్ అందుకుంటున్నా. గతంలో ఏనాడూ ఇంటికి తీసుకువచ్చి పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు. మా వీధిలోని గణేశ్వర పాఠశాల వద్ద గానీ.. పండావీధిలో అంగన్‌వాడీ కేంద్రం దగ్గరకు గానీ రమ్మనేవారు. అది కూడా నెలలో 10వ తేదీ నాటికి కబురు వచ్చేది. ఆ రోజు పింఛన్లు ఇస్తున్నామని అంటే.. ఎండలో వెళ్లేవాళ్లం. ఒక్కొక్కసారి సాయంత్రానికి అధికారి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. కొన్నిసార్లు డబ్బులు రాలేదని, మళ్లీ రండి అని పంపించేవారు. కానీ ఇప్పుడు ఎక్కడికీ వెళ్లడం లేదు. ఇంటి దగ్గర ఉంటే చాలు.. సూర్యుడు ఉదయించకమునుపే వలంటీర్లు డబ్బులు అందిస్తున్నారు. ఇప్పుడు రూ.3వేలు తీసుకుంటున్నాను. నా ఖర్చులకు సరిపోతున్నాయి. మా ఆయుష్షు కూడా పోసుకుని జగన్ నిండు నూరేళ్లూ జీవించాలి.

సంతోషంగా జీవిస్తున్నా..



నా పేరు పొలిమేర అప్పారావు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నా. మాది రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు. ఏడేళ్ల కిందట పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పడిపోయాయి. దీంతో మా కుటుంబం ఛిన్నాభిన్నమైంది. వెంటనే ప్రభుత్వ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. నేను పెట్టుకున్న అర్జీని రద్దు చేశారని తెలిసి చాలా నిరాశకు గురయ్యా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు నా సమస్యను తెలుసుకుని సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. ఆయన సహకారంతో చోడవరంలో సదరం శిబిరానికి వెళ్లి.. సర్టిఫికెట్ పొందాను. తర్వాత వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరైంది. వలంటీర్ ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపు తట్టి మరీ పింఛన్ అందజేస్తున్నారు. సెలవైనా.. పండగైనా సరే ఠంఛన్‌గా అందుతోంది.

జగన్ పుణ్యమాని ఏ లోటు లేదు



నా పేరు చీపురుపల్లి సన్యాసమ్మ. వయసు 80. పరవాడ మండలం నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో నివాసం ఉంటున్నాను. గతంలో నెలకు రూ.200 పింఛన్ అందించేవారు. ఆ తర్వాత రూ.1000కి మించి అందుకోలేదు. ఐదేళ్లుగా రూ.2 వేల నుంచి పెంచుకుంటూ.. ప్రస్తుతం రూ.3 వేలు అందిస్తున్నారు. గతంలో పింఛన్ కోసం గంటల తరబడి పడిగాపులు కాయడం ఇంకా గుర్తే. ఇప్పుడు వలంటీర్లే ఒకటో తేదీన డబ్బులు తెచ్చి ఇస్తున్నారు. ఈ వయసులో ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. కొడుకు, కోడలు బాగా చూసుకుంటున్నారు. ఈ సొమ్ములో కొంత పోస్టాఫీసులో జమ చేసి.. ఆరోగ్యపర సమస్యలు వచ్చినప్పుడు వాడుకుంటున్నాను. జగన్‌బాబు పుణ్యమాని ఏ లోటు లేకుండా తన జీవితం సాఫీగా సాగిపోతోంది.

వైఎస్ జగన్ హామీతో హడావిడిగా..

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో పింఛన్ పెంపు హామీని కాపీ కొట్టిన చంద్రబాబు 2019 జనవరి నుంచి పెన్షన్లు పెంపుదల చేశారు. కొత్త పెన్షన్లు మంజూరు చేసిన ప్రతీసారి ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు తెలుగు తమ్ముళ్లు మామూళ్లు దండుకున్నారు. ఈ విధంగా దాదాపు జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్లకు పైగా వసూళ్ల దందా సాగించారు.

నాడు కత్తెర.. నేడు జాతరలా

ఆనందమానందమాయె..

జన్మభూమి కమిటీ.. చంద్రబాబు పాలనలో ఈ పేరు వింటేనే ప్రతీ పెన్షన్ లబ్ధిదారుడు వణికిపోయే పరిస్థితి ఉండేది. పండుటాకులను రాబందుల్లా పీక్కుతింటూ పింఛన్‌దారులకు చుక్కలు చూపించేవి. అంతేనా.. నెల నెలా పెన్షన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని, నిలబడలేని స్థితిలో కూడా చాంతాడంత క్యూల్లో.. ఎర్రటి ఎండలో గంటల తరబడి నిరీక్షించిన రోజులు మరిచిపోగలమా? పైగా.. చంద్రబాబు పాలనలో అన్నీ అర్హతలున్న వాళ్లు పెన్షన్ కావాలంటే ఏడాదికో, లేదంటే రెండేళ్ల కోసారో మొక్కుబడిగా ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. పింఛన్ తీసుకుంటున్న వారు ఎవరైనా మరణిస్తేనో లేదా ఇతర కారణాలతో తగ్గితేనే కొత్త పెన్షన్లు మంజూరయ్యేవి. అలాంటి పరిస్థితుల్లో.. పింఛన్లు అందక విలవిల్లాడే దుస్థితిలో ఉన్న అవ్వాతాతలకు అండగా నిలుస్తూ.. వారి మోముల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరునవ్వులు నింపింది. అవ్వాతాతలు, దివ్యాంగులు సహా ఇతర సామాజిక భద్రతా పెన్షన్ లబ్ధిదారులందరికీ రామరాజ్యమంటే ఏంటో.. సంక్షేమ శకం తీపిగుర్తులు ఎలా ఉంటాయో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. వలంటీర్ల వ్యవస్థతో ఇంటికే పింఛను అందిస్తూ.. వారికి కొండంత భరోసానిచ్చారు.

– సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది/సింథియా/పరవాడ/ జగదాంబ

- చంద్రబాబు హయాంలో పింఛనుదారుల బాధలు వర్ణనాతీతం
- రాబందుల్లా పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు
- కుంటిసాకులు చెబుతూ వృద్ధుల పింఛన్లకు కత్తెర
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన చిత్రం
- ప్రస్తుతం రూ.3 వేల వరకు పింఛన్ అందజేత
- లబ్ధిదారుల్లో విరబూస్తున్న చిరునవ్వులు



ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెలగబెట్టిన తొమ్మిదేళ్లలో ఏనాడు అవ్వాతాతలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ రోజుల్లో పింఛన్ రూ.75 ఇచ్చే వారు. ఏ గ్రామంలోనైనా ఎవరైనా చనిపోతే తప్ప కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేసేవారు కాదు. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్రలో అవ్వాతాతలు పడుతున్న బాధలను చూసి చలించిపోయారు. 2004లో అధికారంలోకి వచ్చీ రాగానే పింఛన్‌ను ఒకేసారి రూ.200కు పెంచారు. అంతే కాదు సంతృప్తికర పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేశారు. ఆయన హయాంలో మంజూరైనన్ని పెన్షన్లు.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ మంజూరవలేదన్నది చరిత్ర చెబుతోంది. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట... ఉన్న పింఛన్లకు చంద్రబాబు కోత పెట్టారు. పెద్ద ఎత్తున వడపోతలు మీద వడపోతలు చేస్తూ దాదాపు 30 వేలకు పైగా పింఛన్లను తీసేశారు చంద్రబాబు.



ఆ రోజుల్లో పచ్చ చొక్కాలదే హవా

టీడీపీ అధికారంలోకి రాక ముందు జిల్లాలో 3.28 లక్షల పింఛన్లుండేవి. జన్మభూమి కమిటీల పరిశీలన పేరిట 15 వేలకు పైగా పింఛన్లను తొలగించి ఆ తర్వాత రోల్‌బ్యాక్ అంటూ వాటిని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించి తమకు నచ్చిన వారికి మంజూరు చేశారు. ఆ తర్వాత కొత్త పింఛన్ల పేరిట 2014 నుంచి 2019 వరకు 90 వేల పింఛన్లు మంజూరు చేశారు. వీటిలో 90 శాతం జన్మభూమి కమిటీ సిఫార్సులతో పూర్తిగా టీడీపీ నేతలు, కార్యకర్తలకే కేటాయించారు. ఇళ్లు, పొలాలు, ఆస్తులున్న వారికి సైతం పింఛన్లు అందజేసేవారు. అన్ని అర్హతలున్న వారిని పక్కన పెట్టేశారు. పైగా ప్రతి నెలా ఆధార్ లింక్ కాలేదని, వేలి ముద్రలు పడలేదని, ఐరిస్ క్యాప్చర్ కాలేదనే సాకుతో 10 నుంచి 15 శాతం మంది పింఛన్‌దారులకు మొండిచేయి చూపించారు. 2018 డిసెంబర్ వరకు పింఛన్ల కోసం అప్పటి ప్రభుత్వం జిల్లాకు నెలకు రూ.48 కోట్ల వరకు విడుదల చేసింది.

టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	
అర్బన్ ప్రాంతం	1,16,789
గ్రామీణ,ఏజెన్సీ ప్రాంతం	3,05,546
మొత్తం పింఛన్ల సంఖ్య	4,22,335
ప్రతి నెలా ఇచ్చిన మొత్తం	రూ.75.83 కోట్లు
2019 తర్వాత.. వైఎస్సార్ సీపీ హయాంలో..	
ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పింఛన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాలో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు

బాబు కుట్రను ముందే పసిగట్టిన జగన్

'జగనన్న వస్తున్నాడు... నవరత్నాలు తెస్తున్నాడు...'అంటూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచుతామని గుంటూరు వేదికగా జరిగిన పార్టీ ప్లీనరీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ హామీపై ప్రజా సంకల్పయాత్రలో విస్తృత ప్రచారం చేస్తూనే కడప జిల్లా పర్యటనలో ఆయనో మాట చెప్పారు. ఆ దేవుడు ఆశీర్వదించి..మీ అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవ్వాతాతలకు పింఛన్ రూ.2 వేలు చేస్తానని చెప్పారు. జగన్ చెప్పాడు కదా అని చంద్రబాబు ఎన్నికల ముందు రూ.2వేలు చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. చేస్తే చేయనీయండి. ఫర్వాలేదు. అవ్వాతాతలకు ఎంత చేసినా తక్కువే. మన ప్రభుత్వం రాగానే ఆ రూ.2వేలను రూ.3వేలకు పెంచుకుంటూ పోతా.. అని హామీ ఇచ్చారు. జననేత ఊహించినట్టుగానే 2019 ఎన్నికలకు 3 నెలలు ఉండగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ పక్క ఆర్థిక లోటంటూనే పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలు పెంచుతూ ప్రకటన చేసి... ఫిబ్రవరి నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఇందుకోసం చంద్రన్న వరాల పండగ పేరిట ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజుల పాటు హంగామా చేశారు. పెంచిన పింఛన్ పంపిణీలో కూడా టీడీపీ నేతలు చేతివాటం ప్రదర్శించడం మానలేదు. ఒక్కో పింఛన్‌దారుడి నుంచి రూ.500 వరకు వసూళ్లకు పాల్పడ్డారు.

సీఎం జగన్ పాలనలో.. సంతృప్తి స్థాయిలో..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పింఛనుదారులకు కష్టాలన్నీ దూరమయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారులు చిరునవ్వుతో ఇంటి వద్దనే పింఛను తీసుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన చోటుకి వెళ్లి పింఛను తీసుకునేవారు. ఎండలో.. లైన్లలో నిలబడితే.. ఒకటో తేదీ నుంచి పంచడం మొదలు పెట్టేవారు. 15వ తేదీ వచ్చినా కొందరికి పింఛను అందేది కాదు. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో.. ఒకటో తేదీనే ఇంటికొచ్చి మరీ వలంటీరు పింఛను అందిస్తున్నారు. దీంతో.. అవ్వాతాతలే కాదు.. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు.. ఇలా ప్రతి ఒక్కరికీ గుమ్మం వద్దే పింఛన్లు అందుతున్నాయి. 2019 నాటికి ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని వర్గాల పింఛనుదారులు 4.22 లక్షల మంది ఉన్నారు. 2019 జనవరి వరకు కేవలం రూ.48 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించేది. జనవరి తర్వాత మూడు నెలల పాటు రూ 2 వేలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం.. ప్రతి నెలా రూ.75.83 కోట్లు చెల్లించేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కుల, మత, ప్రాంత, రాజకీయాలకతీతంగా.. ఎటువంటి లంచాలు లేకుండా పింఛన్ అందిస్తోంది. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు అనర్హులైన వారికి పింఛన్లు అందించాయి. ఇలాంటి 10 వేల మందికిపైగా గుర్తించి.. వారి పింఛన్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వారి బదులుగా.. పూర్తి అర్హతలున్న వారికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పింఛన్‌దారులకు రూ.3 వేల చొప్పున అందుతోంది.

భారీగా గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

గోపాలపట్నం: కొత్తపాలెం జంక్షన్ మెడికవర్ దుకాణం వెనుక ఉన్న రేకుల షెడ్‌లో సుమారు 250 కిలోల గంజాయిని పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ రేకుల షెడ్‌లో స్థానికంగా టిఫిన్ బండిని నిర్వహిస్తున్నవారు సామగ్రి దాచేశారు. రెండు రోజుల క్రితం వాళ్లకు తెలిసిన వ్యక్తి తన సామగ్రిని రేకుల షెడ్‌లో పెట్టుకున్నాడు. మంగళవారం పోలీసులు వచ్చి పరిశీలించగా ఆ సామగ్రి గంజాయి అని తేలింది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గంజాయి దొరికిన రేకుల షెడ్‌ను విశాఖ నగర కమిషనర్ రవిశంకర్ పరిశీలించారు. ఇక్కడికి గంజాయి ఏ విధంగా వచ్చింది. ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై ఆరా తీశారు. గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు డీసీపీ-2 మోకా సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ సురేష్ ఉన్నారు. పోలీసులు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

బీచ్‌లో రామ్‌చరణ్ దంపతుల సందడి

కొమ్మాది: గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ కోసం నాలుగు రోజుల కిందట సతీసమేతంగా విశాఖ వచ్చిన రామ్‌చరణ్.. ఇక్కడి బీచ్‌లో విహరించారు. తన కుమార్తె క్లీంకార, భర్త రామ్‌చరణ్‌తో కలిసి బీచ్‌లో ఆడుకుంటున్న దృశ్యాలను ఉపాసన కొణిదెల సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. 'వైజాగ్ మా హృదయాలను దోచుకుంది' అని ప్రశంసల జల్లు కురిపించారు.

తిరుగు పయనమైన రామ్ చరణ్

గోపాలపట్నం: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తిరిగి హైదరాబాద్ ప్రయాణమయ్యారు. ప్రత్యేక విమానంలో భార్య ఉపాసన, కుమార్తె క్లీంకారతో కలిసి మంగళవారం ఆయన హైదరాబాద్ బయలుదేరారు. వీరిని చూసేందుకు అధిక సంఖ్యలో అభిమానులు విమానాశ్రయానికి తరలివచ్చారు.



చందనోత్సవం బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: సింహాచల క్షేత్రంలో మే 10న జరిగే చందనోత్సవంలో పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై మంగళవారం నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ దేవస్థానం అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ముందస్తు పరిశీలన చేశారు. కొండదిగువ, సింహగిరిపై పర్యటించి సంబంధిత ప్రణాళికపై చర్చించారు. చందనోత్సవం రోజు ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శన క్యూలు ఎక్కడెక్కడి నుంచి ఏర్పాటు చేస్తున్నారో దేవస్థానం అధికారుల నుంచి తెలుసుకున్నారు. చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఇటీవల దేవదాయ శాఖ కమిషనర్ ప్రతిపాదించిన పలు అంశాలను కూడా ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీని ప్రకారం భక్తులకు అంతరాలయ దర్శనాల రద్దు, ఘాట్‌రోడ్డులో మినీ బస్సులు నడిపే ప్రక్రియ, టికెట్లు రీసేల్ లేకుండా చూడటం తదితర అంశాలపై చర్చ సాగింది. ముఖ్యంగా కొండదిగువ అడవివరం నుంచి పాత గోశాల మార్గంలో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న దృష్ట్యా.. ఆ మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టే చర్యలపై చర్చించారు. సంయుక్త సీపీ ఫకీరప్ప, డీసీపీ-2 ఎం. సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ వెంకట్రావు, ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశాంతి పార్టీకి అవకాశం ఇవ్వండి

కె.ఎ.పాల్

తాటిచెట్లపాలెం: రాబోయే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పుల బారి నుంచి విడిపించి లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చేలా చేస్తానని, స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకుండా చూస్తానని ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్ తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ అవినీతిపరులకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతిని బయటపెడతానని చెప్పారు. ప్రధాని మోదీ రైల్వే, బ్యాంకులు,ఎయిర్‌పోర్టులు.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్‌ను, అన్ని ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి.. అవినీతిపరులకు అమ్ముడుపోతున్నావా అని ప్రశ్నించారు. ఎస్.కోట, పిఠాపురంలో పోటీ చేయమని అక్కడి వారు అడుగుతున్నారని చెప్పారు. ఎస్.కోటలో సమావేశం పెట్టుకునేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 'ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిందెవరు? చంద్రబాబు అంత మోసగాడు లేడని ఆనాడు ఎన్టీఆర్ స్వయంగా తెలపలేదా? ఎన్టీఆర్, తెలుగుదేశం అనుచరులందరూ నాకు మద్దతు ఇవ్వండి. ఎన్టీఆర్‌కు భారతరత్న తీసుకొస్తా' అని పాల్ అన్నారు. భరత్ పోటీ నుంచి తప్పుకోవాలని, అలా చేస్తే అమిత్‌ షాతో చెప్పి రాజ్యసభ ఇప్పిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న కె.ఎ.పాల్

కలల సాకారానికి సాధన చేయండి

యూఎస్- ఇండియా రాయబారి ఎరిక్ గార్సెట్టీ

మధురవాడ: విద్యార్థులు తమ కలలు సాకారానికి కృషి చేయాలని యూఎస్-ఇండియా రాయబారి ఎరిక్ గార్సెట్టీ చెప్పారు. మంగళవారం మధురవాడ సమీపంలోని బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల హాస్టల్‌కు 'సన' స్వచ్ఛంద సంస్థ రూ.20లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, బయో టాయిలెట్స్, సోలార్ ప్యానళ్లను ఆయన హైదరాబాద్ కాన్సులేట్ జనరల్ జెనిఫర్ లార్సెన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ హాస్టల్‌లో మొక్కలు నాటి బాలికలతో పలు అంశాలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా బాలికలతో థింసా నృత్యం చేశారు. అలాగే విద్యార్థుల లక్ష్యాలు..భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారో తెలుసుకున్నారు. విద్యావ్యవస్థకు ప్రభుత్వం ఏం చేస్తే బాగుంటుంది అనుకుంటున్నారన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 'సన' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సంచయిత గజపతిరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు పదేళ్లుగా 40 చోట్ల చేపట్టినట్టు చెప్పారు. విద్యార్థుల పెరటి తోటలో పండించిన పసుపును బహుమతిగా ఇచ్చారు. ఉత్సాహంగా వివిధ అంశాలపై మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హాస్టల్, పరిసరాలు, గ్రామం పరిశుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చే యించారు. పలువురు సంస్థ, ఎంబసి ప్రతినిధులు, హాస్టల్ వార్డెన్ మోహిని పడాల పాల్గొన్నారు.



బోరవానిపాలెంలోని డ్రైవర్స్‌కాలనీ బాలికలు హాస్టల్‌లో విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న భారత్‌లో యూఎస్ రాయబారి ఎరిక్ గార్సెట్టీ

ప్రభుత్వ ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనలకు అనుమతి లేదు

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోడలపై రాతలకు అనుమతి లేదని తేల్చిచెప్పారు. ఎన్నికల సంసిద్ధత, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో విజయవాడ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసి అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ ఉండాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు.